సాక్షి
వనపర్తి
బుధవారం। 28। ఆగస్టు। 2024



.. జములమ్మ పరిణయం

నడిగడ్డ ప్రజల ఇలవేల్పు జములమ్మ కల్యాణం కనులపండువగా జరిగింది.

వివరాలు 8లో ▸



పేలుళ్ల కలకలం

గట్టు మండలం సల్కాపురం గుట్టల్లో పేలుళ్లు కలకలం రేపుతున్నాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.7 /22.7

వాతావరణం

ఉదయం వేళ ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలి

పాన్‌గల్: ఉద్యోగులకు మేలు చేకూర్చే పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గద్దం మురళి, మండల ప్రధానకార్యదర్శి రాముడు మంగళ వారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీపీఎస్ స్థానంలో ఏకీకృత పింఛన్ పేరిట కేంద్రం ప్రకటించిన పింఛన్ విధానం మసిపూసి మారేడుకాయ చేయడమేనని.. దీనిని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. 25 ఏళ్ల సర్వీస్ పూర్తి చేసిన ఉద్యోగులకు 50 శాతం పింఛన్ గ్యారెంటీ, సర్వీసులో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు 60 శాతం ఫ్యామిలీ పింఛన్ ఇస్తామని ప్రకటించినప్పటికీ చందాతో కూడిన పింఛన్ పథకాన్ని రద్దు చేసే విషయాన్ని ప్రస్తావించకపోవడం, పైగా ఐచ్ఛికం అని పేర్కొనటంలోనే అసలు మోసం ఉందని తెలిపారు. ఒక్క రూపాయి చందా చెల్లించకుండానే సర్వీసు బట్టి 50 శాతం పింఛన్ ఇచ్చే పాత విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబరాలు



వనపర్తి: సుప్రీంకోర్టు ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు చేయడంతో మంగళవారం జిల్లాకేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మీడియా కన్వీనర్ నందిమళ్ల అశోక్ మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎదుర్కోలేక ఆయన కుమార్తె ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్ట్ చేసి పైశాచిక ఆనందం పొందారన్నారు. న్యాయస్థానాలపై గౌరవంతో 165 రోజులు జైలులో ఉన్నారని.. చివరకు న్యాయం, ధర్మమే గెలిచిందని చెప్పారు. కార్యక్రమంలో రఘువర్ధన్‌రెడ్డి, నాగన్న, గులాం ఖాదర్, ఇమ్రాన్, నీలస్వామి, రహీం, తిరుపతయ్య, హేమంత్, జోహెబ్ హుస్సేన్, రాము, సునీల్, మోహన్‌యాదవ్, ప్రేమ్‌కుమార్, రాంలక్ష్మణ్, శంకర్, రాములు, శ్రీను తదితరులు ఉన్నారు.



బోనమెత్తిన పల్లెలు

వివరాలు 9లో..

కబ్జా కోరల్లోనే..!

అన్యాక్రాంతమవుతున్న వక్ఫ్ భూములు

- విచారణ పేరిట తాత్సారం
- బహిరంగ మార్కెట్‌లో రూ.కోట్ల విలువ
- కొనసాగుతున్న పంటల సాగు
- నేటికీ పార్ట్‌–బిలోనే..



అమరచింత పెద్ద చెరువు సమీపంలో వక్ఫ్ భూమిలో సాగు చేసిన పత్తి పంట

అమరచింత: రూ.కోట్ల విలువైన వక్ఫ్ భూములు కబ్జాదారుల చేతుల్లో మగ్గుతున్నాయి. మండలంలోని మస్తీపురం, ధర్మాపురం, నందిమళ్ల, సింగంపేట, చంద్రగఢ్, అమరచింత, రంగాపురం గ్రామాల పరిధిలో మొత్తం 72 ఎకరాల భూమి మసీద్‌లు, పీర్లచావిడీలు, రాజావళీ దర్గా, ఖాజీల పేరున ఉన్నట్లు గుర్తించిన రెవెన్యూ అధికారులు వాటిని సంరక్షించే ప్రయత్నాలు చేపట్టలేకపోతున్నారు. ఆ భూములను తమ పెద్దలు కొనుగోలు చేశారని.. తమకే పట్టాలు ఇవ్వాలంటూ కబ్జాదారులు అధికారులకు అర్జీలు కూడా దాఖలు చేశారు. వక్ఫ్ బోర్డు ఆదేశానుసారం సర్వేనంబర్లతో విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులు వాటిని గుర్తించారే తప్పా ఇప్పటి వరకు కంచె ఏర్పాటు చేయలేకపోతున్నారు. వక్ఫ్ భూముల సమస్య పార్ట్‌–బిలో ఉందని.. కోర్టులోనే పరిష్కరించుకోవాలంటూ మసీద్‌లు, దర్గాల నిర్వాహకులకు ఉచిత సలహాలిస్తూ రెవెన్యూ అధికారులు చేతులు దులుపుకొంటున్నారు.

● 2003, జులై 31న ఉమ్మడి రాష్ట్రంలో ఈ భూములకు సంబంధించిన గెజిట్ జారీ చేశారు. రోజులు గడిచిన కొద్ది వ్యవసాయ భూములకు డిమాండ్ పెరగడంతో కొందరు సాగు పేరుతో ఆక్రమించగా.. మరికొందరు నిర్మాణాలు చేపట్టారు. దర్గా, మసీద్‌ల నిర్వాహకులు గతంలోనే తమకు విక్రయించారంటూ కబ్జాలో ఉండిపోయారు. భూములను సంరక్షించాల్సిన వక్ఫ్‌బోర్డ్, రెవెన్యూ అధికారులు వారి బాధ్యతలను విస్మరించి ఆక్రమణదారులతో కుమ్మక్కై చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఐదేళ్ల కిందటే వెలుగులోకి..

వక్ఫ్ భూములు ఆక్రమణకు గురైన విషయం ఐదేళ్ల కిందటే వెలుగులోకి వచ్చింది. అమరచింతలో ఒకరు 7 ఎకరాలు, మరొకరు 4 ఎకరాల భూమిని సమగ్ర భూ సర్వే సమయంలో వారి పేర్ల మీద నమోదు చేయించుకుని ప్రభుత్వం జారీ చేసిన కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు సైతం పొందారు. విషయం తెలుసుకున్న కొందరు యువత అప్పటి కలెక్టర్ శ్వేతా మహంతికి ఫిర్యాదు చేయడంతో జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకాలు రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సమస్య మరుగున పడింది. మండల కేంద్రంలోని హజ్రత్ సయ్యద్‌షా రాజావళీ దర్గా పేరున వివిధ నంబర్లలో మొత్తం 26.30 ఎకరాల భూమి ఉంది. ఈ భూమంతా కబ్జాదారుల చేతుల్లోనే ఉండిపోయింది. మండలంలోని వివిధ గ్రామాల్లో మరో 45.70 ఎకరాల భూమి పరిస్థితి ఇంతే.

వెలిసిన నిర్మాణాలు..

అమరచింత మండల కేంద్రంగా మారడం, పురపాలికగా రూపాంతరం చెందడంతో భూముల ధరలు పెరిగాయి. దీంతో ఖాళీగా ఉన్న వక్ఫ్ భూములు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంటకు వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో ఉన్న 11 ఎకరాల వక్ఫ్ భూమి కొందరి చేతుల్లో ఉండగా, మస్తీపురంలో 7 ఎకరాల భూమి ముగ్గురు ఆక్రమించారు. నందిమళ్లలో 20 ఎకరాలకుపైగా ఉన్న భూమి 12 మంది వ్యక్తుల చేతుల్లో ఉన్నట్లు సమాచారం. మిగతా గ్రామాల్లోని వక్ఫ్ భూముల పరిస్థితి ఇలాగే ఉంది. వక్ఫ్ ఆధీనంలో ఉన్న భూమిని సాగు చేయాలంటే రైతులు ముందుగా అధికారులకు విషయాన్ని విన్నవించాలి.. లేదా వక్ఫ్ బోర్డు నిర్వహించిన వేలంలో పాల్గొని పొందాలనే నియమం ఉన్నా ఇక్కడ మాత్రం పట్టించుకోవడం లేదు.

ఏళ్లుగా పీర్లచావిడీ నిర్వహిస్తున్నాం..



మా తాతల కాలం నుంచి పీర్లచావిడీల నిర్వహణ మేమే చేస్తున్నాం. మసీద్ పేరున ఉన్న భూమిని మా పేరిట పట్టాలివ్వాలి. కాని ఆ భూములు ఇతరులు ఆక్రమించుకున్నారు. అధికారులు న్యాయం చేయాలి.

– మైనుద్దీన్, ముర్షీద్, అమరచింత

వక్ఫ్ బోర్డుకు ఫిర్యాదు చేశాం..



మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న పీర్లచావిడీలు, మసీద్‌లు, దర్గాలు, ఖాజీల పేరిట ఉన్న భూములు ఆక్రమణకు గురవుతున్నాయని గతంలో వక్ఫ్‌బోర్డు అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాం. రెవెన్యూ అధికారులు గుర్తించిన భూముల్లో కంచె ఏర్పాటు చేయడం లేదు. అధికారులు స్పందించి అర్హులకే భూములు అప్పగించేలా చర్యలు తీసుకోవాలి.

– అయ్యూబ్‌ఖాన్, అధ్యక్షుడు, మసీద్ కమిటీ, అమరచింత

సర్వే త్వరగా పూర్తిచేస్తాం..



మండలంలో ఉన్న వక్ఫ్ భూముల వివరాలను గతంలో ఉన్న తహసీల్దార్ ఉన్నతాధికారులకు నివేదించారు. ఇప్పటి వరకు ఆ భూములు పార్ట్–బిలోనే ఉన్నాయి. వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి సమగ్ర సర్వే చేసి నివేదిక అందజేస్తాం.

– రమేష్‌రెడ్డి, తహసీల్దార్, అమరచింత



అమరచింతలో విచారణ చేపడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు (ఫైల్)

విచారణ పేరుతో..

దర్గాలు, మసీద్‌లు, పీర్లచావిడీలు, ఖాజీల పేరుతో ఉన్న భూములు తామే అనుభవించుకునేలా హక్కు కల్పించాలంటూ ఆయా గ్రామాల నిర్వాహకులు వక్ఫ్ బోర్డు అధికారులకు అర్జీలు చేసుకున్నారు. దీంతో కొన్నేళ్లుగా నిజమైన హక్కుదారులు ఎవరని అధికారులు విచారిస్తున్నారే తప్పా ఇప్పటి వరకు సమస్యను పరిష్కరించడం లేదు.

నేడు సీజనల్ వ్యాధులపై 'సాక్షి' ఫోన్‌–ఇన్



డా. సాయినాథ్‌రెడ్డి

వనపర్తి: ప్రస్తుతం ప్రజలు డెంగీ, చికున్‌గున్యా, మలేరియా తదితర సీజనల్ వ్యాధుల బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్లేట్‌లెట్లు తగ్గిపోవడం, జ్వరం తగ్గిన తర్వాత నిరసించడం తదితర వాటిపై జిల్లా ప్రోగ్రాం అధికారి డా. సాయినాథ్‌రెడ్డితో బుధవారం 'సాక్షి' ఫోన్‌–ఇన్ నిర్వహిస్తోంది. ప్రజలు తమ ఆరోగ్య సమస్యల పరిష్కారానికి సంప్రదించవచ్చు.

28.08.2024 బుధవారం
సమయం : ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు
ఫోన్ చేయాల్సిన నంబర్ 94400 56770

సాక్షి ఫోన్ ఇన్

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ఓటరు నమోదు, సవరణ ప్రక్రియను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి రూరల్: జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని మంగళవారం స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు, సవరణ ప్రక్రియ, అదేవిధంగా ఉపాధిహామీ రికార్డులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీ సీఈఓ యాదయ్య, ఎంపీడీఓ రాఘవ, ఎంపీఓ సుదర్శన్, ఏపీఓ సుకన్య తదితరులు ఉన్నారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



సమీక్షలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, అధికారులు, నాయకులు

మదనాపురం: గ్రామాల్లో ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా వారి సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతగా పని చేయాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని సరళాసాగర్ అతిథిగృహం ఆవరణలో అన్ని శాఖల మండలస్థాయి అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా నాయకులను పిలిచి అధికారుల ముందే సమస్యలు అడిగి తెలుసుకొని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. గత వారం తాగునీటి సమస్య తలెత్తి తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని.. మిషన్ భగీరథ ఏఈకి విన్నవించినా పట్టించుకోలేదని ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యను తానే పరిష్కరించానని.. భవిష్యత్‌లో సమస్య పునరావృతం కాకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. సమావేశంలో తహసీల్దార్ అబ్రహం లింకన్, ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఏఈలు, ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ, సీసీ రహదారి నిర్మాణానికి భూమిపూజ..

మండల కేంద్రంలోని రెండు పడక గదుల ఇళ్ల వద్ద రూ.52 లక్షలతో డ్రెయినేజీ, సీసీ రహదారి నిర్మాణానికి ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఎన్నికల సమయంలో హడావుడిగా రెండు పడక గదుల ఇళ్లు అందించి చేతులు దులుపుకొందని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులు చేపడుతోందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నాగన్న, మార్కెట్ వైస్ చైర్మన్ మార్కెట్ తిరుపతిరెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, జగదీశ్, వడ్డె కృష్ణ, మహదేవన్‌గౌడ్, హనుమాన్‌రావు, శరత్‌రెడ్డి, రామకృష్ణ, అంజాద్ అలీ, గోపిస్వామి, వెంకట్‌నారాయణ, టీసీ నాగన్నయాదవ్, సాయిబాబా, శ్రీధర్‌రెడ్డి, ఖాజామైనుద్దీన్, వాకిటి సత్యం, రవీందర్‌రెడ్డి, శాంతన్న, విజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

అమరచింత: పట్టణాలు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, రహదారుల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో నేరాలను చాలావరకు నియంత్రించవచ్చని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం అట్రాసిటీ కేసు విచారణకు పట్టణానికి వచ్చిన ఆయన స్థానిక యువతతో సమావేశమై మాట్లాడారు. సీసీ కెమెరా పరిసరాల్లో జరిగిన ఎలాంటి ఘటనైనా అందులో నమోదై ఉంటుందని వివరించారు. యువకులు, వ్యాపారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పట్టణంలో పూర్తి స్థాయిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు.

● నాలుగు రోజుల కిందట పట్టణానికి చెందిన సంగెపాగు అభినయ్‌పై శ్రీకాంత్, మహిమూద్ అనే వ్యక్తులు దాడిచేసి గాయపర్చారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మంగళవారం డీఎస్పీ వెంకటేశ్వర్లు విచారణ చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న ఓంప్రకాష్ కిరాణ దుకాణం ఎదుట దాడికి గల కారణాలను చుట్టుపక్కల వారిని అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో ఎవరెవరు ఉన్నారు.. ఎందుకు దాడి చేసుకున్నారు.. అన్న విషయాలు తెలుసుకొని ఘటన స్థలాన్ని పరిశీలించినట్లు డీఎస్పీ వివరించారు.

ఆంక్షలు లేకుండా పంట రుణమాఫీ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

వనపర్తి రూరల్: ఎలాంటి ఆంక్షలు విధించకుండా రూ.2 లక్షల వరకు పంట రుణాలను వెంటనే మాఫీ చేయాలని వివిధ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రైతు సంఘం వనపర్తి జిల్లా కమిటీ, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, సీపీఐ నాయకులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టి అనంతరం రెవెన్యూ అదనపు కలెక్టర్ నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కె.విజయరాములు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాబర్ట్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 43 లక్షల మందికిపైగా రైతులు పంట రుణమాఫీకి అర్హత సాధించగా.. ఆగస్టు 15 నాటికి 21 లక్షల మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదన్నారు. రూ.రెండు లక్షలకుపైగా ఉన్న అప్పును చెల్లిస్తేనే మాఫీ చేస్తామని ఆంక్షలు విధించడమేమిటని ప్రశ్నించారు. బ్యాంకు, పట్టాదారు పాసు పుస్తకాల్లోని పేర్లలో తప్పులు, రేషన్‌కార్డు లేదనే సాకు చూపి మాఫీ చేయలేదన్నారు. చాలా సహకార బ్యాంకుల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా మాఫీ కాలేదని తెలిపారు. రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు చెల్లిస్తామని ప్రకటించి.. అభిప్రాయ సేకరణ పేరుతో కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. వర్షాకాలం ముగుస్తున్నా ఇంకా నాన్చడం సరికాదని.. వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, సీపీఐ నాయకులు రమేష్, శ్రీహరి, గోపాలకృష్ణ, మహేష్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

- ప్రతి కేసులో సమగ్ర విచారణ
- ఎస్పీ రావుల గిరిధర్

ఆత్మకూర్: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా ప్రతి కేసును సమగ్రంగా విచారించాలని.. బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్‌తో మాట్లాడి కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. కొత్త చట్టాలపై సిబ్బంది సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, సిబ్బంది తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించాలని సూచించారు. మిస్సింగ్ కేసులను ఛేదించాలని, పోక్సో కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.



కొత్తకోటలో శ్రీకృష్ణుడి ఊరేగింపు

కృష్ణా.. ముకుందా...

జిల్లావ్యాప్తంగా మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. కొత్తకోటలో అందంగా ముస్తాబు చేసిన ట్రాక్టర్‌పై కృష్ణుడి విగ్రహాన్ని ఉంచి ఊరేగించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఒగ్గు డోలు కళాకారుల నృత్య ప్రదర్శన, కాళీమాత వేషధారణలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు కోలాటాలు, యువత డీజే సాంగ్స్‌కు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. కానాయపల్లి సమీపంలోని శ్రీకృష్ణ ఆలయం వద్ద ఉట్లు కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఉట్లు కొట్టేందుకు యువత పోటీపడ్డారు.

– కొత్తకోట రూరల్

'ఓపెన్' యూనివర్సిటీలో మెరుగైన విద్య

- డిగ్రీలో ప్రవేశానికి 31వ తేదీ వరకు అవకాశం
- రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డా.వెంకటేశ్వర్లు



జడ్చర్లలోని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెంటర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జేడీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/జడ్చర్ల టౌన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నట్లు రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డా.వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల, జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో కొనసాగుతున్న ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్లలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 103 డిగ్రీ కళాశాలల్లో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెంటర్లు కొనసాగుతున్నాయన్నారు. ఈ ఏడాది డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు ఆగస్టు 31వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. కాగా, పీజీ తరగతులకు డిమాండ్ అధికంగా ఉందని.. చాయిస్ బేస్ క్రెడిట్ సిస్టం ప్రకారం విద్య అందిస్తున్నామన్నారు. స్కిల్ సంబంధిత కోర్సులు సైతం అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు జూమ్ యాప్, యూట్యూబ్‌లోనూ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూజీసీ న్యాక్ ఏ గుర్తింపు తమ కేంద్రానికి ఉందన్నారు. అందుకే రెగ్యులర్ విద్యతో సమానంగా అన్ని ఉద్యోగాలు, పోటీ పరీక్షలకు అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సర్టిఫికెట్లు చెల్లుబాటు అవుతున్నట్లు చెప్పారు. పీజీ సెంటర్ల పెంపుపై వీసీ నియామకం తర్వాత చర్చిస్తామన్నారు. ప్రతిభ సీరిస్ పేరుతో పీజీ పుస్తకాలను బయటి వారికి విక్రయిస్తున్నామని, వాటికి మంచి డిమాండ్ ఉందన్నారు. ఎంవీఎస్ కళాశాలలోని సెంటర్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా సుమారు 5 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. జేడీ వెంట అధ్యాపకులు పల్లవి, దయాకర్, సదాశివయ్య, కోఆర్డినేటర్లు సత్యనారాయణ, రాఘవేందర్, నిరంజన్, హరిప్రసాద్, నరేందర్ తదితరులు ఉన్నారు.

పాలమూరు డీసీసీబీకి రూ. 500 కోట్లు



డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఏసీఎస్‌ల ఫోరం ప్రతినిధులు

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): సహకార రంగం అభివృద్ధి కోసం కేంద్ర సహకార శాఖ ఆర్థిక విభాగం రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 5 వేల కోట్ల రుణాన్ని మంజూరు చేసిందని.. ఈ మొత్తంలో దాదాపు రూ. 500 కోట్లు మహబూబ్‌నగర్ డీసీసీబీకి సమకూరనున్నాయని చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బ్యాంకు సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పీఏసీఎస్ చైర్మన్ల ఫోరం ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ద్వారా ఉమ్మడి జిల్లా రైతాంగానికి సంక్షేమ ఫలాలు అందించాల్సిన గురుతర బాధ్యత తనపై ఉందన్నారు. డీసీసీబీకి సమకూరే నిధులతో ఉమ్మడి జిల్లా పరిధిలోని 78 పీఏసీఎస్‌లను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. గతంలో మెజార్టీ పీఏసీఎస్‌లు బ్యాంకు నిర్లక్ష్యానికి గురయ్యాయని.. ప్రస్తుతం అటువంటి పొరపాట్లు జరగకుండా అన్ని సంఘాలను సమాన స్థాయిలో అభివృద్ధి పరుస్తామని అన్నారు. సెప్టెంబర్ మొదటి వారం నుంచి కొత్త జిల్లాల వారీగా సమీక్ష నిర్వహిస్తామని.. క్షేత్ర స్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గతంలో వరిధాన్యం సేకరణలో ప్రభుత్వం పీఏసీఎస్‌కే భాగస్వామ్యం కల్పించగా.. ఆ తర్వాత చాలా మండలాల్లో మహిళా పొదుపు సంఘాలకు ఇవ్వడం వల్ల కొన్ని పీఏసీఎస్‌లు ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని స్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని అన్నారు. ఫోరం అధ్యక్షుడు పోతుల మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన డైరెక్టర్లు రంగారెడ్డి, భూపతిరావు, వంశీచందర్‌రెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్లు సుభాన్ ఈదప్ప, నాబార్డు డైరెక్టర్ వెంకటరావు, పీఏసీఎస్ చైర్మన్ల ఫోరం ప్రధాన కార్యదర్శి పాలెం సుదర్శన్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రఘు, వాసుదేవారెడ్డి పాల్గొన్నారు.

నేత్రపర్వం.. జములమ్మ పరిణయం

- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు
- భారీగా తరలివచ్చిన భక్తులు





జములమ్మ అమ్మవారి కల్యాణాన్ని జరిపిస్తున్న పండితులు

గద్వాలటౌన్: నడిగడ్డ ప్రజల ఇలవేల్పు జమ్ములమ్మ కల్యాణోత్సవం ఆలయంలో మంగళవారం ఉదయం 12:15 గంటలకు జరిగింది. సాంప్రదాయబద్ధంగా దేవతామూర్తులను పూజించి పుణ్యాహవచనం నిర్వహించి కన్యాదానం కొనసాగించారు. కంకణధారణ కడు రమణీయమంగా గోత్రనామాలు చదివారు. అంతకుముందు ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో జములమ్మ అమ్మవారిని, వరుడిగా త్రిశూలాన్ని ఊరేగింపుగా పెళ్లిపీటలపైకి తీసుకొచ్చారు. అనంతరం అమ్మవారికి యోక్త్రధారణ, త్రిశూలానికి యజ్ఞోపవితధారణ వేడుక పరమానందమైంది. సమస్త మంగళ వాయిద్యాలు మార్మోగుతుండగా మాంగళ్యధారణ నయనానందంగా మారింది.

అమ్మా.. నీదే దయ

కల్యాణోత్సవానికి ముందు ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలను తీసుకొని వచ్చి ఆలయంలో సమర్పించారు. ఈ సందర్భంగా తరలి వచ్చిన రాజకీయ నాయకులు, ప్రముఖులు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మా.. నీదే దయ అంటూ వేడుకున్నారు. మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జములమ్మ క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతూ రాష్ట్రంలోనే ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుందన్నారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత మాట్లాడుతూ పసుపు, కుంకుమలతో కలకాలం చల్లగా ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం పండితుల నుంచి ఆశీస్సులు పొందారు. జములమ్మ కల్యాణంతో నడిగడ్డ సుభిక్షంగా వర్ధిల్లుతుందని పండితులు పేర్కొన్నారు. వివిధ హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కల్యాణ మహోత్సవంలో ఆలయ ఈఓ పురేందర్ కుమార్, ఆలయ కమిటీ చైర్‌పర్సన్ గాయత్రి, మాజీ చైర్మన్ సతీష్‌కుమార్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ ప్రత్యేక పూజలు



హాజరైన గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత

ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత జములమ్మ ఆలయంలో వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి అమ్మవారి విగ్రహానికి నిత్య విశేష పుష్పాలంకారం చేశారు. కల్యాణోత్సవాన్ని తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచే కాక కర్ణాటక చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

విద్యకు అధిక నిధులు అవసరం



మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వాలు విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి అన్నారు. టీఎల్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బడ్జెట్‌లో కనీసం 15 శాతం నిధులు విద్యకు ఖర్చుచేస్తే పాఠశాలలు, కళాశాలల్లో వసతులు మెరుగుపడతాయన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యం అందించినప్పుడే ఎటువంటి అసమానతలు తలెత్తవని పేర్కొన్నారు. విద్యార్థులపై ఒత్తిడి లేని విద్యావిధానం ఉండాలని, తద్వారా విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి దోహదపడుతుందన్నారు. రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సమానమైన విద్య అందించడం వల్ల అసమానతలు తగ్గుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్, టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, టీఎల్ఎఫ్ కన్వీనర్ కత్తి వెంకటస్వామి, జానయ్య, బెక్కరి అనిత, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

యోగాసన లీగ్‌కు పాలమూరు క్రీడాకారులు



మహబూబ్‌నగర్ క్రీడలు: తమిళనాడు రాష్ట్రం తిరుచ్చిలో ఈ నెల 31 నుంచి వచ్చేనెల 1 వరకు జరిగే అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ యోగాసన లీగ్ సౌత్‌జోన్ పోటీలకు ఇద్దరు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో ఎస్.రిషిక, జూనియర్ విభాగంలో సుప్రజ ఎంపికకాగా.. మంగళవారం వారిని జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, డీవైఎస్ఓ ఎస్.శ్రీనివాస్ అభినందించారు. పోటీల్లో ప్రతిభచాటి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.సాయికుమార్, కోశాధికారి యు.సురేష్, రాజగోపాల్, సునీల్ పాల్గొన్నారు.

పేలుళ్ల కలకలం

సల్కాపురం సమీపంలో అనుమతులు లేకుండానే మైనింగ్



మైనింగ్ నిర్వహించే క్వారీ

- మధ్యప్రదేశ్ వలస కూలీ మృతితో వెలుగులోకి
- పేలుళ్లపై చుట్టుపక్కల గ్రామస్తుల ఆందోళన



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సరితారాణి

గట్టు: భారత్‌మాల రోడ్డు నిర్మాణం కోసం సల్కాపురం, జోకన్‌గట్టు సమీపంలోని గుట్టల్లో నిర్వహిస్తున్న మైనింగ్ పనులకు అడ్డు అదుపు లేకుండా పోయినట్లు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. నిత్యం పెద్ద పెద్ద శబ్దాలతో పొలాల్లో పనులు చేసుకోలేమని, ఇళ్లలో ఉండలేని పరిస్థితులు నెలకొన్నట్లు సల్కాపురం, జోకన్‌గట్టు ప్రజలు అంటున్నారు. ఇక్కడి నుంచే రోడ్డు పనులకు ఉపయోగించే కంకరను పెద్ద టిప్పర్లలో తరలిస్తున్నారు. అయితే మైనింగ్ నిర్వహించే కంపెనీ కనీస నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇటీవల మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కూలీ విజయ్‌కుమార్ సింగ్ గోండు (34) పేలుళ్ల కారణంగా మృత్యువాత పడ్డాడు. దీంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలతో పాటు అందులో పనిచేస్తున్న కార్మికుల్లో ఆందోళన నెలకొంది.

అనుమతులపై నీలి నీడలు..

ఇక్కడ నిర్వహించే మైనింగ్ పనులకు తీసుకున్న అనుమతులపై నీలినీడలు కమ్ముకున్నాయి. జిల్లా అధికారులతో పాటుగా స్థానిక రెవెన్యూ అధికారులు సైతం మైనింగ్ పనులకు సంబంధించిన అనుమతిపత్రాలు మా దగ్గర లేవనే సమాధానం చెబుతున్నారు. ఇది వరకే ఇక్కడ మైనింగ్ పనులను నిలిపి వేయాలని స్థానిక ప్రజాప్రతినిధులు ఆందోళన నిర్వహించారు. అప్పట్లో పనులను కొద్ది రోజులు నిలిపి వేసి మళ్లీ ప్రారంభించారు.

భయంతోనే బతుకుతున్నాం..



ఇక్కడ నిర్వహిస్తున్న పేలుళ్ల కారణంగా భయం భయంతో బతకాల్సి వస్తోంది. పేలుళ్ల కారణంగా మట్టి మిద్దెలు అదిరి మట్టి రాలుతుంది. దీంతో బయటకు పరిగెత్తాల్సి వస్తుంది. ఇష్టం వచ్చినట్లు గుట్టలను పేల్చుతున్నారు. పేలుళ్లకు సంబంధించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం లేదు.

– వెంకటన్న, సల్కాపురం

ఇళ్లకు ప్రమాదం..



ఊరి సమీపంలో నిర్వహిస్తున్న పేలుళ్ల కారణంగా తాము ఇబ్బంది పడుతున్నాం. పేలుళ్లు నిర్వహించినప్పుడు ఇళ్లు అదురుతున్నాయి. కొన్ని ఇళ్లు నెర్రలు బారాయి. ఎప్పుడు పడితే అప్పుడు పేలుళ్లను నిర్వహిస్తున్నారు. వ్యవసాయ పొలాలకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. కంకర కోసం తిరిగే పెద్ద టిప్పర్ల కారణంగా మా ఊరి రోడ్డు దెబ్బతింది.

– వీరేష్, సల్కాపురం

పనులు నిలిపివేయాలని ఆదేశించాం..

సల్కాపురం సమీప గుట్టల్లో చేస్తున్న మైనింగ్ పనులను నిలిపి వేయాలని ఆదేశించాం. పేలుళ్ల కారణంగా వలస కూలీ మృతి చెందిన నేపథ్యంలో మంగళవారం మైనింగ్ నిర్వహిస్తున్న వారిని అనుమతి పత్రాలను చూపాలని కోరాం. ఎలాంటి అనుమతి పత్రాలు చూపించలేదు. కేవలం పొల్యూషన్ పత్రాలు మాత్రమే చూపించారు. దీంతో మైనింగ్ పనులను నిలిపి వేయాల్సిందిగా ఆదేశించాం. పేలుళ్లు నిర్వహించే క్రమంలో ముందస్తుగానే నోటీసులు ఇచ్చిన అనంతరం చేపట్టారు. అవేమి ఇక్కడ పాటించడం లేదు.

– సరితారాణి, తహసీల్దార్

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గొర్రెలకాపరి మృతి

నాగర్‌కర్నూల్(బిజినేపల్లి): మండలంలోని సల్కర్‌పేటకి చెందిన యువకుడు మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సల్కర్‌పేటకు చెందిన భగవంతు విద్యుత్ స్తంభం నుంచి ఇంటి పైకప్పు రేకుల మీదుగా విద్యుత్తు కనెక్షన్ తీసుకున్నాడు. కొద్ది కాలంగా వీస్తున్న ఈదురు గాలులకు ఆ తీగలు తేలి ఉన్నాయి. భగవంతు కుమారుడు శివుడు(16) గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం రేకులను అనుకోకుండా ముట్టుకున్నాడు. విద్యుత్తు తీగలు రేకుల ప్రాంతంలో తేలి ఉండటంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు.

పాముకాటుతో యువరైతు మృతి



చిన్నయ్య (ఫైల్)

వంగూరు: మండలంలోని మిట్టసదగోడుకు చెందిన మేకల చిన్నయ్య(32) పాముకాటుకు గురై మంగళవారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నయ్య తన పొలంలో గుంటుక కొడుతుండగా పాముకాటుకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు వారు తెలిపారు. చిన్నయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

చెరువులో పడి వృద్ధురాలి ఆత్మహత్య



దేవమ్మ (ఫైల్)

కోడేరు: చెరువులో పడి ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలం రాజాపూర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రేకులపాడు దేవమ్మ(65) నిత్యం మద్యం తాగుతుండడంతో కుటుంబీకులు మందలించారు. దీంతో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో గ్రామం అంచున ఉన్న ఊర చెరువులోపడి ఆమె ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు చూసి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఖయ్యాం తెలిపారు. వృద్ధురాలికి ఇద్దరూ కుమార్తెలు, కుమారుడు ఉన్నారని వివరించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో తొమ్మిది మందికి రిమాండ్

ఎర్రవల్లి: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 9 మందిని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు కోదండాపురం ఎస్ఐ స్వాతి తెలిపారు. ఇటీవల పీఎస్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో వీరంతా పట్టుబడ్డారని వివరించారు. అందరినీ అలంపూర్ కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. ఒకరికి 7రోజులు, ఒకరికి 5రోజులు, మరొకరికి 3రోజులు, ఆరుగురికి రెండు రోజుల జైలు శిక్ష విధించారని వివరించారు. ఒక్కొక్కరికి రూ. 2 వేల చొప్పున జరిమానా సైతం విధించారని పేర్కొన్నారు.

కనులపండువగా గెల్వలాంబ రథోత్సవం



వంగూరులో రథాన్ని లాగుతున్న భక్తులు



పుష్ప రథోత్సవానికి హాజరైన భక్తులు

వంగూరు: మండల కేంద్రంలో గెల్వలాంబమాత బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున నిర్వహించిన రథోత్సవానికి గ్రామస్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. రంగురంగుల పూలతో అలంకరించిన రథాన్ని భక్తులు ఆలయం చుట్టూ తిప్పారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్ఐ మహేందర్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వెంకటస్వామి, సభ్యులు జనార్దన్, బాలస్వామిగౌడ్, శేఖర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పుష్ప రథోత్సవం..

చారకొండ: మండలంలోని సిర్సనగండ్ల సీతారామ చంద్రస్వామి ఆలయంలో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృత అభిషేకం, అర్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాదవులు ఉపవాసదీక్షతో ఉట్లు కొట్టారు. రాత్రి ఆలయ ఆవరణలో పుష్ప రథోత్సవం (చిన్న తేరు) నిర్వహించగా వివిధ ప్రాంతాల భక్తులు భారీగా తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దేరం రామశర్మ, ఈఓ ఆంజనేయులు, అర్చకులు మురళీధర్‌శర్మ, లక్ష్మణ్‌శర్మ, యాదవులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల సమీపంలోకి రిజర్వాయర్ నీరు



చిన్నోనిపల్లె సమీపంలో రిజర్వాయర్ బ్యాక్ వాటర్

గట్టు: చిన్నోనిపల్లె వాసుల చింత తీరడం లేదు. రిజర్వాయర్‌లోని బ్యాక్ వాటర్ ఇళ్ల సమీపంలోకి చేరుకున్నాయి. దీంతో చిన్నోనిపల్లె ముంపు గ్రామస్తులు మరింత ఆందోళన చెందుతున్నారు. దేవాలయానికి సమీపంలోకి, ఇళ్లకు 100 మీటర్ల దూరంలో రిజర్వాయర్ బ్యాక్ వాటర్ వచ్చి చేరాయి. ఇప్పటికే డంపింగ్ యార్డు, కిందిగేరిలోని సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ కట్ట చుట్టూ నీరు చేరింది. నీటి నిల్వ కారణంగా విషపురుగుల కారణంగా భయంతో జీవనం సాగించాల్సి వస్తోందని ముంపు గ్రామస్తులు వాపోతున్నారు. ముంపు గ్రామంలోనే ఉంటున్న రైతులు వారి వ్యవసాయ పొలాలకు, పునరావాస కేంద్రానికి వెళ్లే దారి నీట మునిగింది. నీటిలోనే నడుచుకుంటూ ముంపు గ్రామస్తులు వెళ్తున్నారు. రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరగకుండా, అదనంగా వచ్చిన నీటిని రిజర్వాయర్ బయటకు పంపేలా అధికారులు సమాంతర కాల్వను తవ్వారు. ప్రస్తుతానికి కాల్వ ద్వారా రిజర్వాయర్ నీరు మాత్రం బయటకు వెళ్లడం లేదని ముంపు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

10న జాతీయ బృందగాన పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో వచ్చేనెల 10న పాఠశాల విద్యార్థులకు జాతీయ బృందగాన పోటీలు నిర్వహించనున్నట్లు పాలమూరు శాఖ అధ్యక్షుడు భూషణ్ పాండే తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు 6–8 మంది బృందంగా ఏర్పడి, బీవీపీచే ముద్రించిన పుస్తకం నుంచి దేశభక్తి, జానపద గేయాలు పాడాల్సి ఉంటుందన్నారు. వివరాల కోసం 98493 40276 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు. సమావేశంలో బీవీపీ సభ్యులు జి.పాండురంగం, పి.రమేష్‌చందర్, వెంకటేశ్వరగుప్త, కె.చంద్రుడు, టి.నాగేంద్రస్వామి, శివన్న, రాఘవారెడ్డి, వి.శంకరయ్య, జగదీశ్వర్ గుప్త, బస్వరాజ్ ఉన్నారు.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు దిగువ, ఎగువ జలవిద్యుదుత్పత్తి కేంద్రాల్లో ఉత్పత్తి కొనసాగుతుంది. మంగళవారం 11 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈలు రామసుబ్బారెడ్డి, సురేష్ తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, 115.080 మిలియన్ యూనిట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు, 93.517 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని చేపడుతున్నారు. ఇప్పటి వరకు 208.597 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామని తెలిపారు.

రామన్‌పాడులో 1,021 అడుగుల నీటిమట్టం..

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో మంగళవారం 1,021అడుగులకు నీటి మట్టం చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 820 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 900 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నారు.

సుంకేసులలో నిలకడగా ఇన్‌ఫ్లో..

రాజోళి: సుంకేసుల డ్యాంలో ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతుంది. మంగళవారం ఒక గేటు ద్వారానే నీటిని విడుదల చేసినట్లు జేఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 4,725 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా, 2,280 క్యూసెక్కులు దిగువకు వదిలి కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదిలినట్లు ఆయన పేర్కొన్నారు.

శ్రీశైలంలో 884.3 అడుగుల నీటిమట్టం

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో మంగళవారం 884.3 అడుగుల నీటిమట్టం, 211.4 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 1,78,948 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 29,053, సుంకేసుల నుంచి 2,280 మొత్తం 2,08,001 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం వస్తున్నాయి. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 37,882, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,862 మొత్తం 68,744 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 30వేల క్యూసెక్కులు, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్ఐకు 1,931, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్ఎన్ఎస్ఎస్‌కు 1,490 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.851, కుడిగట్టు కేంద్రంలో 10.851 మిలియన్ యూనిట్లు విద్యుదుత్పత్తి చేశారు.

బైక్‌ను ఢీకొన్న కారు: నవవధువుకు తీవ్రగాయాలు

కల్వకుర్తి టౌన్: బైకుపై వెళ్తున్న నవదంపతులను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వధువుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్షసాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన నవదంపతులు రచన, రాఘవేందర్ కలిసి బైక్‌పై వారి ఇంటి నుంచి బస్టాండ్‌కు మంగళవారం రాత్రి బైకుపై వెళ్తున్నారు. పాలమూరుచౌరస్తాలో వారు వెళ్తుండగా వెనుక వైపు నుంచి కారు బలంగా ఢీకొట్టింది. రచనకు తీవ్ర గాయాలు కాగా, పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. అనంతరం ఆమెను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు.

అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకుని..

బల్మూర్: మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా.. తక్కువ పెట్టుబడితో అనతి కాలంలో ఎక్కువ డబ్బులు పొందవచ్చని ఫోన్‌లో వచ్చిన యాప్‌లను చూసిన.. వీరంరామాజీపల్లికి చెందిన మైలారం దశరథం, శ్రీకాంత్‌గౌడు, దొంతి మల్లయ్య పెట్టుబడులు పెట్టారు. కాగా సదరు యాప్‌లు కొద్ది రోజులుగా పనిచేయకపోవడంతో తాము మోసపోయామని గుర్తించారు. మంగళవారం బల్మూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా దశరథం రూ.11 వేలు, శ్రీకాంత్‌గౌడు, దొంతి మల్లయ్య రూ. 2,69,200 పెట్టుబడి పెట్టి సైబర్‌నేరగాళ్ల చేతిలో మోసపోయారని పోలీసులు వివరించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



ఇటిక్యాలపాడు శివారులో మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రవిబాబు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారి పక్కన ఇటిక్యాలపాడు శివారులోని ఘర్ దాబా సమీప మార్గంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని పోలీసులు తెలిపారు. గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు పక్కన పడినట్లు తెలిపారు. వ్యక్తికి 45 నుంచి 50సంవత్సరాల వయస్సు ఉంటుందని, అతని శరీరంపై బూడిదరంగు టీషర్టు, నీలం రంగు లుంగీ, మెడకు ఎరుపు రంగు దారం ఉందన్నారు. మృతదేహాన్ని అలంపూర్ మార్చరీలో భద్రపరిచినట్లు వివరించారు. మృతదేహాన్ని సీఐ రవిబాబు, ఇటిక్యాల ఎస్ఐ పరిశీలించినట్లు ఏఎస్ఐ సుబ్బారెడ్డి తెలియజేశారు.